ఇఫ్తార్ విందుకు హాజరైన మంత్రి

రంజాన్ మాసాన్ని పురస్కరించుకుని అందోల్-జోగిపేట మున్సిపాలిటీలో గురువారం రాత్రి ముస్లింలు ఏర్పాటు చేసిన ఇఫ్తార్ విందుకు మంత్రి దామోదర రాజనర్సింహ హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన ముస్లింలకు శుభాకాంక్షలు తెలిపారు. మాజీ ఎంపీ సురేశ్‌షెట్కార్, కౌన్సిలర్లు చిట్టి బాబు, శివశంకర్, నాయకులు వెంకటేశం, ప్రవీణ్, సోహేల్‌ఖాన్, ఖలీద్, ఇమ్రాన్, అక్రమ్ తదితరులు పాల్గొన్నారు.

-అందోల్, మార్చి 28

ఎన్నికల్లో అక్రమ మద్యాన్ని అడ్డుకోవాలి

- పకడ్బందీగా చెక్ పోస్టులు నిర్వహించాలి
- జహీరాబాద్ సబ్-డివిజన్ నేర సమీక్షలో ఎస్పీ చెన్నూరి రూపేశ్

జహీరాబాద్ సబ్-డివిజన్‌లో వివరాలు పరిశీలిస్తున్న ఎస్పీ చెన్నూరి రూపేశ్

సంగారెడ్డి, మార్చి 28 : రానున్న లోకసభ ఎన్నికల్లో అక్రమ మద్యం, డబ్బు సరఫరాకు తావు లేకుండా పకడ్బందీగా చెక్‌పోస్టులు నిర్వహించి పాత నేరస్తుల ప్రవర్తనను బట్టీ బైండోవర్ చేయాలని అధికారులను ఎస్పీ చెన్నూరి రూపేశ్ ఆదేశించారు. గురువారం జహీరాబాద్ సబ్-డివిజన్ నేర సమీక్ష సమావేశాన్ని స్థానిక మహీంద్రా అతిథిగృహంలో నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ ఎన్నికల దృష్ట్యా అధికారులు, సిబ్బంది 24/7అందుబాటులో ఉండాలని, సమీక్షా సమావేశంలో అధికారులకు సూచించారు. పెండింగ్(అండర్ ఇన్వెస్టిగేషన్)లో ఉన్న గ్రేవ్, నాన్ గ్రేవ్ కేసుల వివరాలను అడిగి తెలుసుకున్నారు. సామాన్య ప్రజానికానికి ఇబ్బందులు కలిగించే విధంగా చట్టవ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడే వ్యక్తులపై కఠినంగా వ్యవహరించాలన్నారు.

సీసీ కెమెరాలకు ముందుకు రావాలి

తాము నివాసం ఉండే ప్రాంతాల్లో దొంగతనాలు, దోపిడీలు జరుగకుండా కాలనీవాసులు, వ్యాపారులు, ప్రజాప్రతినిధులు, వివిధ కుల సంఘాల వారు సీసీ కెమెరాల ఏర్పాటుకు ముందుకు రావాలని ఎస్పీ సూచించారు. జాతీయ రహదారుల ప్రధాన కూడళ్లు, పార్కింగ్ ప్రాంతాలు, పెట్రోల్ పంపులు, దాబాల్లో సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకునేలా సంబంధిత యజమానులకు తెలియజేయాలని ఎస్‌హెచ్‌ఓలను ఆదేశించారు. జిల్లా వాసులు ఎన్నికల నియమావళికి కట్టుబడి ఉండాలని, ఎవరూ కూడా ఇతర పార్టీలను గానీ వ్యక్తులను కించపరిచే విధంగా వ్యాఖ్యలు చేస్తూ సోషల్ మీడియాలో పోస్టులు పెట్టోద్దన్నారు. 18 ఏండ్లు వయస్సు నిండిన యువతీ, యువకులు ప్రతి ఒక్కరూ ఓటు హక్కును కలిగి ఉండాలని సూచించారు. సమావేశంలో జహీరాబాద్ డీఎస్పీ రామ్‌మోహన్‌రెడ్డి, ఇన్స్పెక్టర్ రవి, రూరల్ ఇన్‌స్పెక్టర్ నయిముద్దీన్, డీసీఆర్బీ ఇన్‌స్పెక్టర్ రమేశ్ తదితరులు పాల్గొన్నారు.

విధులు సక్రమంగా నిర్వహించాలి

కోహీర్, మార్చి 28 : వైద్యసిబ్బంది తమ విధులను సక్రమంగా నిర్వహించాలని డిప్యూటీ డీఎంఅండ్‌హెచ్‌వో శంకర్ ఆదేశించారు. గురువారం మండలంలోని దిగ్వాల్ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని ఆయన సందర్శించి రికార్డులను తనిఖీ చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ రోగులకు మెరుగైన వైద్య సేవలందించాలని సూచించారు. ప్రభుత్వ దవాఖానల్లోనే ప్రసవాలు అయ్యేలా జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ నవీన్ కుమార్, ఎంపీహెచ్‌ఎస్ శ్రీనివాస్‌రెడ్డి, వైద్యసిబ్బంది ఉన్నారు.

మత్స్యశాఖ భవన నిర్మాణానికి విరాళం

జిన్నారం, మార్చి 28 : ఊట్ల గ్రామంలో నిర్మిస్తున్న మత్స్యశాఖ భవన నిర్మాణానికి మాజీ సర్పంచ్ జింకల శివరాజ్ విరాళం అందజేశారు. గురువారం తన నివాసంలో మత్స్య సహకార సంఘం సభ్యులకు రూ.50 వేలు నగదును శివరాజ్ అందజేశారు. మరో యాభైవేలు అందిస్తానని వారికి మాటిచ్చారు. గ్రామంలో నిర్మిస్తున్న మత్స్యశాఖ భవనానికి తన వంతు సహకారం అందజేసినట్లు శివరాజ్ తెలిపారు. మల్లేశ్, భిక్షపతి, రాజు, కృష్ణ, సురేశ్, శ్రీనివాస్, నాగరాజు, బాలేశ్ ఉన్నారు.

రెండు ఇండ్లల్లో చోరీ..

రామచంద్రాపురం, మార్చి28 : తాళం వేసి ఉన్న రెండు ఇండ్లలో చోరీ జరిగిన సంఘటన ఆర్సీపురం పోలీస్‌స్టేషన్ పరిధిలోని బండ్లగూడ గ్రామంలో చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. బండ్లగూడలోని నందన్‌రతన్ ప్లైడ్‌లో హనుమంతు, శ్రీనివాస్ ప్రహ్లాద్‌కిరణ్ ఎదురెదురు ఇండ్లలో నివాసం ఉంటున్నారు. కాగా 24వ తేదీన ఇరువురు సొంత పనుల నిమిత్తం ఇండ్లకు తాళం వేసి వేర్వేరు ఊర్లకు వెళ్లారు. తాళం వేసి ఉన్న ఇండ్లను దొంగలు టార్గెట్ చేసి ఇంటి తాళాలు పగులగొట్టి ఇంట్లో చొరబడి చోరీకి పాల్పడ్డారు. ఊర్లకు వెళ్లిన వారు 27న తిరిగి వచ్చి చూసేసరికి ఇంట్లో చోరీ జరిగినట్లు భావించి పోలీసులకు సమాచారం అందించారు. విషయం తెలుసుకున్న పోలీసులు ఘటన స్థలానికి వెళ్లి పరిశీలించారు. హనుమంతు ఇంట్లోని బీరువాలో నుంచి 4 తులాల బంగారు ఆభరణాలు, శ్రీనివాస్‌ప్రహ్లాద్ కిరణ్ ఇంట్లో 40 తులాల వెండి వస్తువులు, నగదు చోరీకి గురైంది. ఈ మేరకు బాధితుల ఫిర్యాదు మేరకు ఎస్సై శశికాంత్‌రెడ్డి కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

భక్తిభావాన్ని అలవర్చుకోవాలి

ఎమ్మెల్యే సునీతాలక్ష్మారెడ్డి

ఎమ్మెల్యే సునీతాలక్ష్మారెడ్డిని సన్మానిస్తున్న నేతలు

హత్నూర, మార్చి28 : ప్రతిఒక్కరూ భక్తిభావాన్ని అలవర్చుకోవాలని సర్సాపూర్ ఎమ్మెల్యే సునీతాలక్ష్మారెడ్డి తెలిపారు. గురువారం హత్నూర మండలం శేర్కాన్‌పల్లిలో నూతనంగా నిర్మించిన దుర్గాభవానీ ఆలయంలో విగ్రహప్రతిష్ఠాపన మహోత్సవంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యేను నాయకులు ఘనంగా సన్మానించారు. ఎమ్మెల్యే వెంట మాజీసర్పంచ్‌లు లక్ష్మీనారాయణ, సుదర్శన్‌గౌడ్, ఉపసర్పంచ్ ప్రభాకర్, నాయకులు శివరామకృష్ణ, ప్రదీప్‌గౌడ్, నారాయణగౌడ్, నర్సింహులు, సురేశ్, పోచ య్య, తదితరులు ఉన్నారు.

క్షయ వ్యాధిని నివారించాలి

సంగారెడ్డి కలెక్టరేట్, మార్చి 28 : క్షయ వ్యాధి ప్రాచీన కాలం నుంచి ప్రజలను ఇబ్బంది పెడుతున్న ఒక అంటు వ్యాధి అని, ఈ వ్యాధి వ్యాప్తిని నివారించొచ్చని స్థానిక తారా ప్రభుత్వ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ కేఎస్ఎస్. రత్నప్రసాద్ పేర్కొన్నారు. గురువారం జిల్లా క్షయ వ్యాధి నియంత్రణ విభాగం సహకారంతో తారా కళాశాలలో భాగ్య క్లబ్, బయోటెక్నాలజీ విభాగాల ఆధ్వర్యంలో క్షయ వ్యాధి- నివారణ మార్గాలు అనే అంశంపై అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ మాట్లాడుతూ ఈ వ్యాధి రాకుండా ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. కఫంతో కూడిన దగ్గు వంటి లక్షణాలు మూడు వారాల కంటే ఎక్కువగా ఉంటే వెంటనే చికిత్స చేయించుకోవాలని సూచించారు.

శానిటరీ న్యాప్కిన్లు పంపిణీ

బొల్లారం, మార్చి 28 : విద్యార్థులు వ్యక్తిగత శుభ్రతను పాటిస్తూ ఆరోగ్యవంతులుగా ఉంటూ చదువుపై ఆసక్తి పెంచుకోవాలని ఆదర్శ పాఠశాల ఇన్‌చార్జి ప్రిన్సిపాల్ బాలకృష్ణ అన్నారు. శుక్రవారం నగరానికి చెందిన కాన్సన్‌ట్రిక్స్ అనే సంస్థకు చెందిన ప్రతినిధులు స్వచ్ఛందంగా ముందుకు వచ్చి పాఠశాలలోని 85 మంది బాలికలకు శానిటరీ న్యాప్కిన్లు పంపిణీ చేశారు. సంస్థ ప్రతినిధులు, పాఠశాల ఉపాధ్యాయులు లలిత, భార్గవి, పీడీ శశిరేఖ తదితరులు పాల్గొన్నారు.

తాగునీటి సరఫరాకు చర్యలు

కాలనీలో పర్యటించిన మున్సిపల్ కమిషనర్

బీసీ కాలనీలో పర్యటించి స్థానికుల సమస్యలు తెలుసుకుంటున్న కమిషనర్ మంగతాయారు

బొల్లారం, మార్చి 28 : బొల్లారం మున్సిపాలిటీ పరిధిలోని రెండో వార్డు బీసీ కాలనీలో నెలకొన్న సమస్యలపై 'నమస్తే తెలంగాణ'లో ఖాళీ బిందెలతో మహిళల నిరసన అనే శీర్షికన గురువారం ప్రచురించిన కథనానికి మున్సిపల్ అధికారులు స్పందించారు. శుక్రవారం ఈ మేరకు కమిషనర్ మంగతాయారు శానిటరీ ఇన్‌స్పెక్టర్ వినోద్‌కుమార్, ఇంజినీరింగ్ విభాగం సిబ్బందితో కలిసి బీసీ కాలనీలో పర్యటించారు. నీటి ఎద్దడి, రోడ్లు, డ్రైనేజీ సమస్యలను పరిశీలించారు. స్థానిక ప్రజల ఇబ్బందులను తెలుసుకొని రెండు ట్యాంకర్లతో నీటిని సరఫరా చేశారు. పలు వీధుల్లో బోర్లు పనిచేయకపోవడంతో అక్కడ కూడా ట్యాంకర్ల ద్వారా నీటిని అందిస్తామని కమిషనర్ స్థానికులకు హామీ ఇచ్చారు.

పార్లమెంటు ఎన్నికల్లో బీజేపీని చిత్తుగా ఓడించాలి

సీఐటీయూ జిల్లా కోశాధికారి రాజయ్య

సమావేశంలో మాట్లాడుతున్న సీఐటీయూ నాయకుడు రాజయ్య

సంగారెడ్డి, మార్చి 28 : త్వరలో జరగబోయే లోకసభ ఎన్నికల్లో బీజేపీ పార్టీని చిత్తుచిత్తుగా ఓడించాలని, కేంద్ర ప్రభుత్వం నియంతలా వ్యవహరిస్తుందని సీఐటీయూ జిల్లా కోశాధికారి రాజయ్య ధ్వజమెత్తారు. గురువారం పట్టణంలోని సుందరయ్యభవన్‌లో సీఐటీయూ సంగారెడ్డి ముఖ్య కార్యకర్తల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా రాజయ్య మాట్లాడుతూ గడిచిన పదేండ్లలో దేశంలో బీజేపీ కార్మిక, కర్మక ప్రజా వ్యతిరేక విధానాలు అనుసరిస్తుందని మండిపడ్డారు. ఈ సమావేశంలో సీఐటీయూ నాయకులు యాదగిరి, సువర్ణ, శోభ, యాదగిరి, రాజు, శ్రీనివాస్, రమాదేవి, మరియమ్మ, సుగుణ, సంగమేశ్వర్, ఆంజనేయులు, మహేశ్, శ్రీనివాస్, లక్ష్మీనారాయణ, యాద య్య తదితరులు పాల్గొన్నారు.

కేజీబీవీల్లో వాయిస్ ఫర్ గర్ల్స్

సంగారెడ్డి కలెక్టరేట్, మార్చి 28 : కస్తూర్బాగాంధీ పాఠశాలల్లో యుక్తవయస్సు బాలికల కోసం వాయిస్ ఫర్ గర్ల్స్ శిబిరాన్ని ఈ నెల 9 నుంచి 28తేదీ వరకు నిర్వహించామని గురువారం డీడబ్ల్యూవో లలితా కుమారి తెలిపారు. జిల్లాలోని 10 కేజీబీవీ పాఠశాలలో శిబిరం నిర్వహించి మొదటి దశ పరిచయాన్ని నిర్వహించామన్నారు. ఇందులో భాగంగా బాలికల యుక్తవయస్సు, ప్రాథమిక హక్కులు, హింస వంటి అంశాలపై అవగాహన కల్పించామన్నారు. ఆయా కార్యక్రమాలను జీసీడీవో మాధవి, జిల్లా సమన్వయకర్త పల్లవి పర్యవేక్షిస్తున్నారని ఆమె పేర్కొన్నారు.

విద్యార్థులకు పాదరక్షలు పంపిణీ

విద్యార్థులకు ఉచితంగా పాదరక్షలు అందజేస్తున్న రాఘవేందర్ శ్రీలత దంపతులు

పుల్కల్, మార్చి 28 : మండల కేంద్రం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో చదువుతున్న పేద విద్యార్థులకు హైదరాబాద్‌కు చెందిన రాఘవేందర్ శ్రీలత దంపతులు వంద మందికి ఉచితంగా పాదరక్షలు అందజేశారు. పాఠశాలలో విధులు నిర్వహిస్తున్న శ్రీనివాస్‌చారి మిత్రుడు రాఘవేందర్ సహకారంతో అందజేయడం సంతోషించ దగ్గ విషయమని ప్రధానోపాధ్యాయులు శంకర్ అన్నారు.

బార్ అసోసియేషన్ అధ్యక్షుడిగా నర్సారెడ్డి

బార్ అసోసియేషన్ బాధ్యులను సన్మానిస్తున్న న్యాయవాదులు

నారాయణఖేడ్, మార్చి 28 : నారాయణఖేడ్ బార్ అసోసియేషన్ అధ్యక్షుడిగా సీనియర్ న్యాయవాది జి.నర్సారెడ్డి ఎన్నికయ్యారు. గురువారం నిర్వహించిన బార్ అసోసియేషన్ ఎన్నికల్లో భాగంగా సీనియర్ న్యాయవాది చంద్రశేఖర్‌రావు ఎన్నికల అధికారిగా వ్యవహరించారు. కాగా ఉపాధ్యక్షుడిగా సుధాకర్, ప్రధాన కార్యదర్శిగా లక్ష్మణ్‌రావు, సంయుక్త కార్యదర్శిగా అలిగే జీవన్, కోశాధికారిగా పి.నర్సింహారావు, మహిళాప్రతినిధిగా ప్రమీల పాటిల్ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఆనంద్ స్వరూప్ శెట్కార్, కె.భోజిరెడ్డి, మారుతిరెడ్డి, సంగమేశ్వర్‌రెడ్డిలను కార్యవర్గ సభ్యులుగా ఎన్నుకున్నారు. నూతనంగా ఎన్నికైన బార్ అసోసియేషన్ బాధ్యులను న్యాయవాదులు శుభాకాంక్షలు తెలిపారు.

రోడ్డు భద్రతా నియమాలు పాటించాలి

ప్రజలకు అవగాహన కల్పిస్తున్న కళాకారులు

కోహీర్, మార్చి 28 : తమ గమ్య స్థానాలకు సురక్షితంగా చేరేందుకు ప్రతిఒక్కరూ రోడ్డు భద్రత నియమ, నిబంధనలను పాటించాలని కళాకారులు గురువారం తమ పాటల ద్వారా అవగాహన కల్పించారు. నాసిక్‌కు చెందిన మహీంద్ర పరిశ్రమలోజిస్టిక్స్ ఆధ్వర్యంలో రంజోల్, దిగ్వాల్, కవేలి గ్రామాల జాతీయ రహదారిపై ప్రజలకు నిబంధనల గురించి వివరించారు. సంస్థ ప్రతినిధులు సంతోశ్ కుమార్, ధన్‌రాజ్, సభ్యులు కమలాకర్, సారంగపాణి, ఉశయ్య, సువర్ణ, రజిత, రామచంద్రం, తదితరులు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో యువకుడి మృతి

సదాశివపేట, మార్చి 28 : బైక్‌ను లారీ ఢీకొట్టడంతో ఓ యువకుడు మృతిచెందిన ఘటన 65వ జాతీయ రహదారిపై గురువారం చోటు చేసుకున్నది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. మండల పరిధిలోని వెల్టూర్ గ్రామానికి చెందిన లక్ష్మణ్ (20), రాము సోదరులు పనుల నిమిత్తం ద్విచక్ర వాహనంపై సదాశివపేటకు వెళ్తున్నారు. నిజాంపూర్ బైపాస్ రోడ్డు దాటుతుండగా జహీరాబాద్ వైపు వెళ్తున్న లారీ బైక్‌ను ఢీకొట్టింది. దీంతో లక్ష్మణ్ అక్కడికక్కడే మృతిచెందగా రాముకు స్వల్ప గాయాలయ్యాయి. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ప్రభుత్వ దవాఖానకు తరలించారు. మృతుడి అన్న రాము ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

సిద్ధివినాయక ఆలయంలో ప్రత్యేక పూజలు

హద్నూర్ వరసిద్ధివినాయకుడికి హారతి ఇస్తున్న భక్తులు

న్యాల్‌కల్, మార్చి 28 : మండలంలోని రేజింతల్ సిద్ధివినాయక ఆలయంలో గురువారం భక్తుల దర్శనాలతో సందడిగా మారింది. సంకష్ట హర చతుర్థి దినోత్సవాన్ని పురస్కరించుకొని ఉదయం నుంచే ఆలయంలో పూజరులు స్వామి వారిని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా పలు ప్రాంతాలకు చెందిన భక్తులు స్వామి వారికి ప్రత్యేక పూజలు చేసి దర్శించుకున్నారు. భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలుగకుండా ఆలయ ట్రస్టు ఆధ్వర్యంలో ఏర్పాట్లు చేశారు. మండల పరిధిలోని హద్నూర్‌లోని వరసిద్ధివినాయక, చీకూర్తి గ్రామంలోని సిద్ధి వినాయక ఆలయాల్లో కూడా సంకష్ట హర చతుర్థి వేడుకలను ఘనంగా నిర్వహించారు. పరిసరా గ్రామాలకు చెందిన భక్తులు తరిలివచ్చి స్వామి వారికి ప్రత్యేక పూజలు చేశారు. పలువురు భక్తులు ఆయా ఆలయాల్లో అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు.

కార్మికులకు కనీస వేతనాలు ఇవ్వాలి



ఎమ్మెల్యే చింతాప్రభాకర్‌కు వినతిపత్రం అందజేస్తున్న సీఐటీయూ నాయకులు

సంగారెడ్డి/సదాశివపేట మార్చి 28 : కార్మికులకు కనీ స వేతనాల జీవోలను పెరిగిన ధరలకు అనుగుణంగా సవరించాలని కోరుతూ స్థానిక ఎమ్మెల్యే చింతాప్రభాకర్‌కు గురువారం సీఐటీయూ నేతలు వినతి పత్రాన్ని అందజేశారు. సదాశివపేటలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో కలిసిన అనంతరం సీఐటీయూ రాష్ట్ర కార్యదర్శి బీరం మల్లేశం మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం 73వ షెడ్యూ ల్డ్ పరిశ్రమల్లో కనీస వేతనాల జీవోలను పెరిగిన ధరలకు అనుగుణంగా సవరించాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వం పెట్టుబడిదారులు, పారిశ్రామిక యాజమాన్యాలకు ప్రయోజనం కలుగుతుందని, తక్కువ వేతనాలు నిర్ణయించి కార్మికుల కడుపులు కొట్టే చర్యకు ప్రభుత్వం సిద్ధమైందని దుయ్యబట్టారు. ఎమ్మెల్యేను కలిసిన వారిలో నాయకులు యాదగిరి, ప్రవీణ్, మల్లేశం, రాజు తదితరులు పాల్గొన్నారు.

అయ్యప్ప విగ్రహం పున:ప్రతిష్ఠాపన

అయ్యప్పస్వామికి అభిషేకం చేస్తున్న భక్తులు

సంగారెడ్డి, మార్చి 28 : శ్రీ ధర్మశాస్త అయ్యప్పస్వామి దేవాలయ పున:ప్రతిష్ఠాపన వేడుకలు, కుంభాభిషేకాలు దిగ్విజయంగా నిర్వహించారు. గురువారం పట్టణంలోని బైపాస్ రోడ్డు అయ్యప్ప కాలనీలో నిర్మించిన స్వామి పున:ప్రతిష్ఠాపన కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ వేడుకలు అరుణ గురుస్వామి కరకమలములతో స్వామివారి కుంభాభిషేకం అత్యంత వేభవోపేతంగా నిర్వహించారు. వేద బ్రహ్మనోత్తముల మంత్రోచ్చరణల మధ్య భక్తిశ్రద్ధలతో ప్రతిష్ఠాపన చేశారు. సాయంత్రం దేవాలయ ఆవరణలో అష్టదశ సోపాన మహాపడి పూజ కార్యక్రమాన్ని నిర్వహించారు. కార్యక్రమంలో గురుస్వాములు జయప్రకాశ్, జనప్రియ రాజు, దేవాలయ కమిటీ అధ్యక్షుడు కొక్కొండ శ్రీశైలం, ప్రధాన కార్యదర్శి లక్ష్మణ్ గౌడ్, కోశాధికారి సాగర్, ఉపాధ్యక్షుడు శేషగిరి, సహాయ కార్యదర్శి గోపాల్, కార్యనిర్వహక కార్యదర్శి అరుణ్, సభ్యులు పాల్గొన్నారు.

ప్రతి ఒక్కరూ ఛత్రపతి బాటలో నడవాలి

పీపడ్‌పల్లిలో ఛత్రపతి శివాజీ మహారాజ్ విగ్రహాన్ని ఆవిష్కరిస్తున్న బర్దీపూర్ మఠం పీఠాధిపతి డాక్టర్ సిద్ధేశ్వర్ మహారాజ్

రాయికోడ్, మార్చి 28 : ప్రతి ఒక్కరూ ఛత్రపతి శివాజీ మహారాజ్ బాటలో నడుచుకోవాలని బర్దీపూర్ మఠం పీఠాధిపతి డాక్టర్ సిద్ధేశ్వర్ మహారాజ్ అన్నారు. గురువారం మండల పరిధిలోని పీపడ్‌పల్లి గ్రామంలో నూతనంగా నిర్మాణం చేపట్టిన ఛత్రపతి మహారాజ్ విగ్రహావిష్కరణ కార్యక్రమంలో ఆయన పాల్గొని ప్రసంగించారు. సమావేశంలో బీదర్ పీఠాధిపత్తి డా. అమృత్‌రావు, దుదాల పీఠాధిపత్తి విఠేలేశ్వర్ మహరాజ్, మాజీ డీసీఎంఎస్ చైర్మన్ సిద్దన్నపాటిల్, మాజీ జడ్పీటీసీ అంజయ్య, కాంగ్రెస్ మండలాధ్యక్షుడు నర్సిములు, బీఆర్ఎస్ మండలాధ్యక్షుడు బస్వరాజుపాటిల్, నాయకులు కేదార్ నాథ్‌పాటిల్, నాగ్‌శేటి, సుభాష్‌పాటిల్, రావి, మెహన్,అనిల్ ఉన్నారు.

వైభవంగా విగ్రహ ప్రతిష్ఠాపనోత్సవాలు

ఆంజనేయ స్వామి విగ్రహ ప్రతిష్ఠాపనలో పాల్గొన్న నాయకులు, భక్తులు

జిన్నారం, మార్చి 28 : మంగంపేట గ్రామంలో విగ్రహప్రతిష్ఠాపనోత్సవాలు మూడు రోజులుగా వైభవంగా జరిగాయి. గురువారం ఆంజనేయస్వామి, నవగ్రహాలు, బొడ్రాయి, ఊరడమ్మ, లింగమయ్య, ఎల్లమ్మ, పోచమ్మ, నాగులమ్మ విగ్రహాలను వేద పండితుల మంత్రోచ్చరణలతో యంత్రాలు, విగ్రహాల ప్రతిష్ఠ జరిగింది. గతంలో ఇచ్చిన హామీ మేరకు వైస్ ఎంపీపీ గంగురమేశ్ మంగంపేట గ్రామంలో ఆంజనేయస్వామి ఆలయం నిర్మించి విగ్రహాన్ని ప్రతిష్ఠించారు. ఈ కార్యక్రమాలకు ఎంపీపీ రవీందర్‌గౌడ్, మాజీ సర్పంచ్‌లు శ్రీకాంత్‌రెడ్డి, జింకల శివరాజ్, కాంగ్రెస్ మండలాధ్యక్షుడు వడ్డె కృష్ణ, ఊట్ల మాజీ ఉపసర్పంచ్ ప్రతాప్‌రెడ్డి, వివిధ గ్రామాల నాయకులు, భక్తులు పాల్గొన్నారు.

దొరికిన డబ్బులు పోలీసులకు అప్పగింత

రామచంద్రాపురం,మార్చి 28 : ఏటీఎంలో దొరికిన డబ్బులను ఓ యువకుడు స్వచ్ఛందంగా కొల్లూర్ పోలీసులకు అప్పగించాడు. వివరాల్లోకి వెళ్లితే.. శ్రీనివాస్‌రెడ్డి అనే వ్యక్తి తన కంపెనీకి సంబంధించిన రూ.10లక్షలు డిపాజిట్ చేసేందుకు గురువారం రాత్రి తెల్లాపూర్‌లోని ఐసీఐసీఐ ఏటీఎం వద్దకు వచ్చాడు. అక్కడ ఏటీఎం మిషన్‌లో రూ.8 లక్షలు డిపాజిట్ చేసి మరో రూ.2లక్షలు ఏటీఎం మిషన్‌పై పెట్టి మర్చిపోయాడు. ఆ తర్వాత ఉస్మాన్‌నగర్‌కు చెందిన నంద్యాల నరేందర్ ఏటీఎంకు వెళ్లాడు. అక్కడ ఏటీఎంపై ఉన్న రూ.2 లక్షలు గమనించి కొల్లూర్ పోలీసులకు సమాచారం అందించి వారికి రెండు లక్షలు అప్పగించాడు. ఏటీఎంలో దొరికిన డబ్బులను స్వచ్ఛందంగా వచ్చి అప్పగించిన నరేందర్‌ను పోలీసులు అభినందించారు.

విద్యార్థులకు యూనిఫాం అందజేత

గుమ్మడిదల, మార్చి28 : న్యూలాండ్ పరిశ్రమ సీఎస్ఆర్ నిధులతో విద్యార్థులకు రూ.5 లక్షల విలువ చేసే యూనిఫాంలను అందజేసింది. గురువారం మండలంలోని దోమడుగు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో చదివే 250 మంది విద్యార్థులకు న్యూలాండ్‌ల్యాబరేటరీ జీఎంహెచ్ఆర్ రవి, ఏజీఎం మురళీకృష్ణ ఆధ్వర్యంలో రెండు జతల యూనిఫాంలు, ఒక జతస్పోర్ట్స్ యూనిఫాంలను ప్రధానోపాధ్యాయుడు శ్రీనివాస్ సమక్షంలో అందజేశారు. వారి వెంట డాక్టర్ అడ్రియన్, యూనిట్ హెచ్ ఆర్ శ్రీహర్ష, ప్రసాద్ ఉన్నారు.

నేడు బీఆర్ఎస్ అందోల్ నియోజకవర్గ స్థాయి సమావేశం

అందోల్, మార్చి 28 :నేడు జోగిపేటలోని శ్రీరామ ఫంక్షన్‌హాల్‌లో లోకసభ ఎన్నికల నేపథ్యంలో అందోల్ నియోజకవర్గ స్థాయి సమావేశం నిర్వహించనున్నట్లు మాజీ ఎమ్మెల్యే చంటి క్రాంతికిరణ్ గురువారం ప్రకటనలో తెలిపారు. నియోజకవర్గంలోని అన్ని మండలాల నాయకులు పెద్ద ఎత్తున తరలిరావాలన్నారు.

అటవీ భూములు ఆక్రమిస్తే చర్యలు

హత్నూర, మార్చి 28 : అటవీశాఖ భూములు ఆక్రమిస్తే చర్యలు తప్పవని అటవీశాఖ డిప్యూటీ రేంజ్ ఆఫీసర్ షాహిని హెచ్చరించారు. గురువారం హత్నూర మండలం శేర్కాన్‌పల్లి శివారులోని పలుగు పోచమ్మ ఆలయసమీపంలో అటవీశాఖ భూమిలో నిర్మించిన అక్రమ నిర్మాణాలు తొలగించారు. అటవీశాఖకు చెందిన భూముల్లో అక్రమ నిర్మాణాలు చేపట్టినా భూమిని ఆక్రమించినా చట్టరీత్యా చర్యలు తప్పవని హెచ్చరించారు. గతంలో అటవీశాఖ భూమిలో ఏర్పాటుచేసిన రేకుల షెడ్లకు నోటీసులు జారీచేస్తున్నట్లు ఆమె పేర్కొన్నారు.

విద్యుత్ షాక్‌తో రైతు మృతి

కంది, మార్చి 28 : విద్యుత్ షాక్‌కు గురై రైతు మృతి చెందిన సంఘటన గురువారం సాయంత్రం కంది మండల పరిధిలోని కలివేముల గ్రామంలో చోటు చేసుకుంది. ఇంద్రకరణ్ ఎస్సై విజయ్‌కుమార్ తెలిపిన వివరాల ప్రకారం.. కలివేముల గ్రామానికి చెందిన రైతు చెల్మేటి మల్లారెడ్డి (48) గురువారం సాయంత్రం వ్యవసాయ పొలంలో ఉన్న ట్రాన్స్‌ఫార్మర్ వద్ద వైర్లు సరిచేస్తుండగా ప్రమాదవశాత్తు కరెంట్ షాక్ గురై అక్కడికక్కడే మృతి చెందాడు. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు సంఘటన స్థలాన్ని పరిశీలించి కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు.